## పోదామా, ఇక పోదామా!

బస్సు స్టాపులో నిలబడ్డాను. బస్సు కనుచూపు మేరలో వుందా, లేదా అని చూడబోతే బస్సు కనబడలేదు. కాని, ఆ మూల రమణమూర్తి కనబడ్డాడు. చప్పున మొహం తిప్పేసుకున్నాను. అయితే ఒక నిమిషం గడిచేలోగా అతను నా దగ్గిరికొచ్చేసి, "ఏంటోయ్, విశేషాలు!" అని భుజం తట్టాడు.

"అబ్బే ఏం లేదు. అటువేపు పనుంది, బస్సుకోసం చూస్తున్నాను" అన్నాను.

"మా స్టేషన్ ఇంప్రూవ్ చేస్తున్నాం తెలుసా?" అన్నాడు.

"మరేనట! మిక్కిలి శక్తివంతమైన ట్రాన్స్‌మీటర్ వస్తోందని, సొంత జాగా కొనుక్కొని అందులో స్టూడియో, ఆఫీసూ, క్వార్టర్సు కట్టుకుంటున్నారని పేపర్లో చదివాను!" అన్నాను.

"అదికాదయ్యా బాబూ" అంటూ ఏదో చెప్పబోయాడు.

"కొంపదీసి- మంచి ప్రోగ్రాంలు ప్రసారం చేద్దామని నిర్ణయం గట్రా తీసుకొన్నారా యేం?" అని నేనంటూ వుండగానే బస్సొచ్చేసింది. ముష్టియుద్ధంలో అతనోవేపూ, నేనోవేపూ అయిపోయాం. అతను బస్సెక్క లేకపోయినట్టు గమనించి నిశ్చింతగా నిట్టూర్చేను.

వాళ్ళ ప్రోగ్రాంలు బాగుండడంలేదని చెప్పడానికి, పుబలాటం కన్న మొహమాటం యెక్కువ నాకు. అంచేత అన్యాపదేశంగా తప్ప దేశంలో ఎవరూ ఆ మాట స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. అవతలింటి కోడలు ఆరళ్లు ఎరగదన్నట్టుగా పూరుకుంటున్నారు అందరూనూ.

అయితే—

"మీ రేడియో లైసెన్సు పదేళ్ళ నాటిదండీ" అన్న రేడియో

లైసెన్సు ఇన్‌స్పెక్టర్ మాటకి, "మీ వాళ్ళ ప్రోగ్రాంలు కూడా అప్పటి వేనండి" అనే జవాబుతో ఒక కార్టూన్ ఏదో పత్రికలో పడింది.

ఇరుగింట్లో రేడియో పాడుతూ వుంటే పొరుగింటాసామీ గొడ్డలి పట్టుగొచ్చి రేడియోని నరికేస్తే, రేడియో గలాయన విషాదంగా మొహంపెట్టి "ప్రోగ్రాం నచ్చకపోతే చెప్పొచ్చుగా, రేడియో ఆపేద్దామూ" అన్నట్టు ఒక కార్టూన్ వచ్చింది.

మెకానిక్ రేడియోని రిపేర్‌చేసి ఇస్తూ "అయ్యా, యంత్రం బాగుంది. ప్రోగ్రాములకి మాత్రం మా పూచీలేదు" అంటున్నట్టు ఒక కార్టూన్ వచ్చింది.

ఇలాంటి వేవైనా రమణమూర్తికి చూపించడం, అతన్ని బాధ పెట్టడం నాకు సరదా.

బస్సులో ఎక్కాక అతని సంగతి మరిచిపోయాను. కాని, అతను నన్ను మరిచిపోకుండా (ఎలా ఎక్కాడో) జనాన్ని తోసుకొని నన్ను చేరి, "నువ్వు మా ఆఫీసు దగ్గిర దిగు" అన్నాడు.

"ఏమిటి సంగతి ?" అన్నాను.

ఢిల్లీ నుంచి వొచ్చారట వొకాయన. ప్రోగ్రాంల విషయంలో చాలా పెద్ద అధికారిట. ఈ వూళ్ళో రచయిత లందరితో మీటింగు పెట్టారట, అక్కడికి రమ్మన్నాడు. సరే చూద్దాం అని వెళ్ళాను.

ఢిల్లీ ఆఫీసరుగారు, రేడియో అనగానేమి అన్న పాయింటుతో మొదలెట్టి, రేడియో ప్రోగ్రాంలు శ్రవ్యకావ్యాలని వుటంకిస్తూ ప్రతి రేడియో స్టేషన్ అభివృద్ధికి స్థానిక కళాకారులు చేయగల సహాయం ఇనుమిక్కిలిగా వుందన్నారు. కథలు, నాటకాలు, ప్రసంగాలు, చర్చలు, సమీక్షలు_ ఎన్నెన్నో వ్రాయాలని వాటిని, శ్రోతలకు ఉత్తమ పద్ధతిలో సమర్పించడానికి తోడ్పడాలని, అక్కడికి చేరిన రచయితలను, నటులను అర్థించారు.

"మీరిచ్చే కాంట్రాక్టుల వెనకప్రక్క ఏమి వ్రాసుంటుందో చూసే వాడెవ్వడూ మీకు ఏదీ వ్రాసి పంపడు."

"ఏ విషయం మీదనైనాసరే, సహేతుకంగా, విజ్ఞానాత్మకంగా, రాసి పంపిస్తే ప్రసారం చెయ్యడానికి సిద్ధంగా వుండరు మీరు. అంచేత మీకు రాయడానికి చాలామంది సిద్ధపడరు."

"ఒకే రచయిత ఒక నాటిక, ఒక ప్రసంగం, ఒక కథానిక మీ కివ్వడానికి సిద్ధపడ్డాడనుకోండి- వస్తువు ఎంత బాగున్నాసరే ఏ మూడు నెలల కొకసారో తప్ప అతని రచనను మీరు ఉపయోగించు కోలేరు. అందుచేత శక్తిగల రచయిత తాను రాసింది త్వరగా జనాన్ని చేరుకోవాలంటే మిమ్మల్ని ఆశ్రయించ గోరడు."

ఇలా కొందరు నిర్మోహమాటస్తులైన రచయితలు ఆ ఢిల్లీ అధికారికి మనవి చేసుకొన్నారు.

"ఇటు చూడండి, రేడియో అందరూ వింటారు. తల్లి, తండ్రి చెల్లి, పెళ్ళాం అందరూ వుండగా గృహస్థు తన తీరిక సమయంలో రేడియో వింటాడు. అటువంటప్పుడు వారి కందరికీ అర్థమయ్యేవి, వారిలో ఏ ఒక్కరూ అసహ్యించుకోనివీ అయిన విషయాలను గూర్చే మీరు రాయడం, మేం ప్రసారం చెయ్యడం ధర్మం. రాజకీయాలు, రాజకీయ నాయకులు సాంఘిక దురాచారాలు, దైనందిన వ్యవహారాలలో కష్ట నిష్ఠూరాలు ఇలాంటివి రేడియో ప్రసారానికి విషయాలుగా ఎంచు కోవడంవల్ల సుఖంకంటె ఇబ్బంది ఎక్కువ. ఎవరికో నొప్పి కలిగించే పని ఎన్నడూ చేయకండి, చేయమనకండి. హాయిగా నవ్వించేవి, తేలిగ్గా నిట్టూర్చేవి, తీయగా స్మరించుకునేవి ప్రపంచంలో ఎన్ని విషయా లున్నాయో మీకు చెప్పనక్కర్లేదు. అవే రాయండి, అవే మేం ప్రసారం చేస్తాం. అలాంటివి మామూలు రతయితల కంటె శక్తిమంతులైన రచయితలు బాగా రాస్తారని, మేధావులైన మీ కందరికీ నా మనవి!" అని, ఆయన సమాధానం చెప్పారు.

"చాలా సంతోషమండీ. మీవల్ల ఎన్నో విషయాలు నేర్చు కున్నాం" అని లేచారందరూనూ.

(17-6-78)